సాహిత్య సంచికా కార్యక్రమం

చలంగారి సాహిత్యం

# చలంగారి నాటకాలు

డా॥ మొదలి నాగభూషణ శర్మ

తన నవలల ద్వారా, నాటకాల ద్వారా, కథల ద్వారా, మ్యూజింగ్స్ ద్వారా ఆధునికి తెలుగు సాహిత్యానికి ఒక కొత్త ఊపును, తెలుగు పాఠక లోకానికి ఒక వినూత్నమైన ఉత్తేజాన్ని కలిగించిన ఘనత గుడిపాటి వెంకట చలానిది. చెప్పదలుచుకున్న విషయాన్ని సూటిగా, నిర్దిష్టంగా, సునిశితంగా చెప్పడం ఆయన తెలుగు సాహిత్యకులకు నేర్పిన పాఠం. తాను నమ్మిన సిద్ధాంతాన్ని నలుగురికి చెప్పగలిగిన ధైర్యం, తనను కలిచివేసిన సమస్యలకు మూలభూతమైన సామాజిక నికృష్టతనీ, దానికి పట్టంకట్టే మనుషుల అధమ ప్రకృతినీ చీల్చి చెండాడగల ధీశక్తి ఆయన తెలుగు రచయితల కిచ్చిన వజ్రాయుధం.

నిజానికి చలం నాటకకర్తగా ప్రసిద్ధుడు కాదు. ఆయన నాటకాలలో శిల్పంలేదు. అవి ప్రదర్శనార్హాలు కావు. కొన్నయితే కేవలం సంభాషణాత్మకాలు. ఆ నాటకాలు బుద్ధిలేక రాశాను. ఇంక ఎన్నటికీ అట్లాంటి పని చెయ్యను అని చలమే రమణాశ్రమం నించి 1966లో రాసుకున్నాడు. అయినా ఈ మాటల్ని మనం అంతగా ఖాతరు చెయ్యక్కర్లేదు. వానిని కేవలం – మనోదృష్టిని తాత్విక చింతన వైపుకు అంతర్ముఖం చేసుకుంటున్న మానవికవాది చలం – ఒకనాడు తన సర్వవ్యక్తిత్వాన్ని ఉత్తేజింపచేసిన ఉద్విగ్న భావోద్వేగాన్ని నాటకాలుగా, నవలలుగా కథలుగా తీర్చిదిద్దిన పూర్వపు హృదయవాది చలానికి యిచ్చిన యోగ్యతా పత్రంగా భావించవచ్చు.

చలానికి ఇటు తెలుగు నాటకరంగం గురించి, అటు భారతీయ, పాశ్చాత్య నాటక రంగాలను గురించి తెలుగుసుననడానికి దాఖలాలు వున్నాయి. సమకాలీన తెలుగు నాటక రంగానికి ఊపిరి పోస్తున్న ఊకదంపుడు పద్యాల నాటకాలను అపహసిస్తూ చలం – వేదుల సత్యనారాయణశాస్త్రి, చింతా దీక్షితులు గార్లతో 'మదన సాయక కార్యవీర్యము' అన్న చక్కని నాటక ప్రహసనాన్ని రాశాడు. బిషప్స్ క్యాండిల్‌స్టిక్స్ ఆధారంగా రంగదాసు, ఇబ్సన్ వ్రాసిన ఘోస్ట్స్ ఆధారంగా 'ఇదేం జబ్బు' ఆయన మీద పాశ్చాత్య నాటకాల ప్రభావాన్ని వ్యక్తం చేసే కొన్ని ఉదాహరణలు.

చలం దాదాపు 30 నాటకాలు నాటికలు రాశాడు. వీటినన్నింటినీ సాంఘికాలూ, సాంఘికి స్పృహ కలిగిన పౌరాణిక గాథల పునర్వ్యాఖ్యానాలూ అంటూ రెండు వర్గాల కింద విభజించవచ్చు. వేటిని సమస్యా నాటకాలని, వ్యాఖ్యాన నాటకాలనీ అంటాను – సౌలభ్యం కోసం.

సమస్యా రూపకాల్లో మంగమ్మ, మృత్యువు, త్యాగం, విడాకులు వంటివి ప్రఖ్యాతాలు. పరిధిలో చిన్నవి. 'నాటికలు' అని కూడా పిలవడానికి వీలుకాని సంభాషణా ప్రధానాలైన గల్పికులు – ఈర్ష్య, వీరమ్మ, ఆడవాళ్ళ

ఆకలి – వంటివి సంఘంలో స్త్రీ మీద జరుగుతున్న అత్యాచారానికి అద్దంపట్టే రచనలు. కొసమెరుపు ముఖ్యమెరుపు ముఖ్యమైన వాక్చిత్రాలు.

చలం స్త్రీకి ఆశించిన స్వేచ్ఛకు, దాని పరిణామాలకు 'మంగమ్మ' నాటకాన్ని ప్రతినిధిగా పేర్కొనవచ్చు. నాటకకర్తగా చలంలో కనిపించే మంచిచెడులు రెండూ మనకి నాటకంలో గోచరిస్తాయి. రెండు తరాలకు చెందిన నలుగురు స్త్రీల అక్రమ కామసంభోగాలు ఇందులో వర్ణించబడ్డాయి. తెలిసీ తెలియని వయస్సులో, వితంతువైన తాను సుందరేశయ్య ఆకర్షణకు లొంగిపోయిన మంగమ్మ, ఆ మంగమ్మ స్వంతకొడుకు నారాయణ చేత చెరచబడ్డ, ఆవిడ పెంపుడు కొడుకు వెంకటాచలం మొదటి భార్య విమల, సుందరేశయ్య కూతురు, వెంకటాచలం రెండో భార్య. నారాయణ చేత ఆకర్షింపబడ్డ కామాక్షి – ఎవరి అత్యాచారానికో గురి అయిన తోటమాలి కూతురు – వీళ్ళు ఈ నాటకంలో ముఖ్య స్త్రీ పాత్రలు.

వరసకు అన్న, చెల్లెలు (ఒకే తండ్రి బిడ్డలు కావడం వల్ల) అయిన నారాయణ కామాక్షిల అక్రమ సంబంధం. మంగమ్మ, సుందరయ్యలో చేతగానితనం ఈ నాటకానికి ముగింపు. నాటకం చాలావరకు మంగమ్మలోని పబ్లిక్ సెల్ఫ్, ప్రైవేట్ సెల్ఫ్‌ల మధ్య జరుగుతున్న సంఘర్షణకు పరాకాష్ట – అయినా తమ అక్రమ సంబంధాన్ని గురించి మురిసిపడిపోతున్న నారాయణ, కామాక్షిలతో నాటకాన్ని అంతం చేయడంతో వాళ్లను గురించిన చలం అభిప్రాయం అస్పష్టంగా ఉండిపోయింది చలం సృష్టించిన పాత్రల్లో మంగమ్మలో విమల పాత్ర, 'శశాంక'లో అనూరాధ పాత్రలానే అతి దయనీయమైనది.

స్త్రీ స్వేచ్ఛకు, విశృంఖలమైన స్త్రీ పురుష సంబంధ పర్యవసానినికి, శారీరక భౌతిక వాదానికి 'మంగమ్మ' నాటకం అద్దం పడితే, చలం హృదయవాదానికి 'మృత్యువు' చక్కని ఉదాహరణ. ఇందులో మృత్యువు చేసే వికటాట్టహాసాలు వినిపించవు. ఏదో తెలియరాని అస్పష్టమైన అనుభూతితో బతికిన జీవితాలకు దూరమై మెత్తని కాంతిని సుందరంగా నింపుకున్న చచ్చిపోయిన వాళ్ల లోకానికి చేరుకున్న కొందరు వ్యక్తుల ఆశలూ, ఆశయాలూ, వారి వారి వ్యక్తిత్వాలు ఇందులో వ్యక్తం చేశాడు చలం. ముసలాళ్ళు కుర్రాళ్ళూ, వితంతువులూ, వృద్ధసన్యాసులూ, మందులమ్మే వాడూ, బొమ్మలు గీసేవాడు – ఇలా ఒక క్రాస్ సెక్షన్ ఆఫ్ సొసైటీని ప్రవేశపెట్టి, స్వభావ స్ఫోరకాలయిన లాలిత్యాన్ని, నడవడికలని – చలం మార్కు వ్యంగ్యంతో కాక – అందర్నీ అర్థం చేసుకున్న మానవతావాదిగా – ప్రస్ఫుటం చేస్తాడు. నాటకం చివరికి వీరడు అనే పల్లెటూరివాడు తన భార్యాబిడ్డల్ని వదిలి ఉండలేనని, వాళ్ళే తనకి సర్వస్వమనీ ఏడుస్తూ – తనని తిరిగి అక్కడికే పంపమని గోలపెడితే, పరలోకం అధికారి – 'గోలపడకు. నీకన్న కరుణగల శక్తి వాళ్ళ సంగతి కనుక్కుంటుందిలే, వెళ్ళు' అంటాడు.

చలం ఆర్ద్రభావనకఉ ఇది మచ్చుతునక.

చలం సాంఘిక నాటకాల్లో చాలాభాగం సంఘ బహిష్కృతులైన స్త్రీల ఆర్తి ఆలంబనగా రాసినవి. వ్యాఖ్యాన నాటకాలు ఆత్మఔన్నత్యాన్ని వ్యక్తులు పడే మనోవేదనని చిత్రిస్తాయి. నాకు సంఘసంస్కరణాభిలాష

చాలా తక్కువ. మనుషులు (ముఖ్యంగా నేను) వ్యక్తిగతంగా ఉన్నతులు కావాలనే నాదేవుళ్ళాట అన్న చలం మాటలు ఈ వ్యాఖ్యాన నాటకాలకు సరిగ్గా వర్తిస్తాయి.

స్త్రీ పురుష సంబంధమైన శారీరక వాదం నుంచి ఎదిగి హృదయనాడి అయిన చలం సాంఘిక నాటకాల్లో కనిపిస్తే, శారీరక, హృదయవాదాలు ఆలంబనగా మానసిక వాదం వైపుకు పయనించే చలం ఈ వ్యాఖ్యాన నాటకాల్లో గోచరిస్తాడు. చిత్రాంగి, సావిత్రి, జయదేవ, శశాంక, పురూరవ – అనుభైవక వేద్యమై ఇంద్రియాలకు సాధ్యమైన అనంత సుఖపారవశ్యాన్ని వ్యక్తీకరిస్తూనే, అనుభవాలకు ఒదగని, మానవుల ఊహల్లో మాత్రమే మెలిగే అపార సుందర జీవితానందానికి ఆర్రుదలు చాచే మానవుల సౌందర్యాన్వేషణను నాటకీకరిస్తాయి. వీనిలో శిల్పం దృష్ట్యా కూడా ఉన్నతమైన నాటిక 'భానుమతి'. దుర్యోధనుడి ధర్మపత్ని కొత్త దృక్పథంతో చిత్రించాడు చలం ఇందులో.

ఈ వ్యాఖ్యాన నాటకాలలో కూడా అవహేళనాత్మకాలు లేకపోలేదు. హరిశ్చంద్ర, సీత అగ్ని ప్రవేశం, నరసింహావతారం – వంటి నాటకాలలో తరతరాల నుంచి వచ్చే పౌరాణిక గాథలకు మామూలుగా ప్రజల యిచ్చే సాంప్రదాయకమైన విలువలు ఎంత హాస్యాస్పదమైనవో చూపుతాడు.

'సావిత్రి' నాటక రచన చలం సాహిత్యం జీవితంలో ఒక మలుపు. దీనిలోని ఉన్నత భావములన్నీ మేటర్‌లింక్ కవిని అన్నాడు చలం. ప్రత్యక్షంగా కనిపించని ప్రభావం మేటర్‌లింక్‌ది – చలం మీద – బెల్జియన్ నాటకకర్త మేటర్‌లింక్ 19వ శతాబ్దం చివరికాలంలో నియో–రొమాంటినిజం పద్ధతిలో రచనలు చేసినవాడు. ఎక్కువ భాగం మధ్యయుగాల నుంచి కథలు తీసుకున్నాడు. కాల్పనిక నాటకకర్తలు చాలామంది యిలా కథాకాలాన్ని తెలియని యుగాలకు తీసుకుపోయారు. ఊహాలోకాల్లో పయనించే నిర్వ్యాపార భావం (డ్రీమింగ్ ఇనాక్టివిటీ) ఆయన పాత్రల ప్రముఖ లక్షణం. ఆయన నాటకాల్లో – ముఖ్యంగా ది ఇంట్రూడర్ వంటి నాటకాల్లో మేటర్‌లింక్ నిశ్చల నాటకరంగం (స్టాటిక్ థియేటర్)ని సృష్టించే ప్రయత్నాలు చేశాడు. వీటిలో కథాసంవిధానం, పాత్ర పోషణ ఉండవు. కొన్ని పాత్రలు తమ సంభాషణలు ద్వారా తమ మనోగతమైన ఊహలకు రూపకల్పన చేస్తారు. నిజానికి అటువంటి నిశ్చల నాటకరంగాన్ని తెలుగువారికి దగ్గరగా తెచ్చారు చలం. ఆయన రచయిత మిత్రుడు చింతా దీక్షితులు.

'సావిత్రి'లో ప్రేమ కోసం ధర్మాన్ని, శీలాన్ని పణంగా పెట్టినా ఫరవాలేదు అన్న యముడి సూత్రాన్ని అంగీకరించిన సావిత్రి పరమ ప్రేమైకమూర్తిగా చలం ముందు సాక్షాత్కరిస్తుంది. మరి స్త్రీ నుంచి ఇంతటి త్యాగాన్ని ఆశించిన రచయిత జయదేవుడి వంటి తన పరుష అన్వేషణలను – స్త్రీలతో, వారి అభీష్టాలతో నిమిత్తం లేకుండా ఆడుకునే – రసపిపాసువులను, సంయమనం లేని వారి లాలసత్వాన్ని ఎలా సృష్టించాడో తలుచుకుంటే ఆశ్చర్యం వేస్తుంది. ఏ పురుషుడి క్రౌర్యాన్నయితే అపహసించి విమర్శించాడో, చలం కూడా చివరకు ఆ పురుషుడి పక్షమే అయినాడా అనిపిస్తుంది.

ఈ వ్యాఖ్యాన నాటకాల్లో జయదేవ, శశాంక, పురూరవ చలం రచనలన్నింటిలోను ద్యోతకమయ్యే మూడు విభిన్న దృక్పధాలకు ప్రతినిధులుగా కన్పిస్తాయి. 'జయదేవ' కేవలం శరీర సంబంధమైన భౌతిక వాదాన్ని, పురూరవ కేవలం మానసిక వాదాన్ని ప్రపంచిస్తే, 'శశాంక' ఈ రెంటికీ భిన్నమైన హృదయవాదాన్ని ప్రపంచిస్తుంది.

సావిత్రిలో చెప్పినట్టే 'ప్రేమ కోరిన త్యాగానికి జంకేవాడు ప్రేమకనర్హుడు' అంటూ బృహస్పతి కాంతి నుంచి విముఖువు కావద్దు' అని నిర్దేశిస్తాడు తారను. తనను సంజాయిషీ అడగడానికి వచ్చిన గౌతముణ్ణి నిలదీసి అవివేకం సంగతి తలుచుకున్నావా అని ప్రశ్నిస్తాడు. ఒక సంపూర్ణమైన అనుభవం కోసం తార పయనించిన అన్వేషమార్గాన్ని విశ్వ ప్రేమ సూత్రానికి అనుసంధించాడు చలం.

'పురూరవ' చలం సాహితి జీవితానికి పరాకాష్ట. ప్రేమోపాసకుడి అన్వేషణలో అతిమానవీయమైన సౌందర్యాన్ని ఆరాధించడంలోని అంతిమ అనుభవం – ఇందులో కనిపిస్తుంది. సిద్ధాంతం గొప్ప దయనీ. దాన్ని సాహితీ మార్గంలోకి మలచడంలో చలం కృతకృత్యుడు కాలేకపోయాడనిపిస్తుంది. రెండే పాత్రలు, అనుభవాల వర్ణనం తప్ప, వాగ్వివాదం తప్ప – నాటకంలో నాటకీయత పూర్తిగా కొరవడింది. అంతేకాక – కొద్దిలో మలచవలసిన సూత్రాన్ని పొడిగించి పొడిగించి సుధీర్ఘం చేయడం వల్ల అవే అనుభవాలను మళ్ళీ మళ్లీ చెప్పే పునరావృతం ఈ నాటకంలో బీజప్రాయమైన అన్వేషణకి ఆటకంల కలిగిస్తుంది. ఐతే అన్వేషణ వల్ల వచ్చే ఫలితాల కన్న – కొత్తదాన్ని అన్వేషించాలన్న జిజ్ఞాసే – చలం సాహిత్యం అంటే ఈ అన్వేషణే ఈనాటికీ పాఠకుణ్ణి ఆకట్టుకోవడానికి గల ముఖ్య కారణాలు.

సమస్యా నాటకాలలో తాను నమ్మిన దానిని ధైర్యంగా సూటిగా చెప్పాలనే చిత్తసుద్ధి, వ్యాఖ్యాన నాటకాల్లో జీవితంలో అన్వేషణక్కు బలాన్ని చూపూ జిజ్ఞాసా – ఈ రెంటినీ భావితరాల తెలుగువారికి వారసత్వంగా ఇచ్చిపోయాడు చలం. సమస్యల్ని చిత్రికరించడం నాటకాల్లో, నవలల్లో, కథల్లో అంతటా కనిపిస్తుంది. సౌందర్యాన్వేషణ కూడా అరుణ వంటి నవలల్లో, జయదేవ వంటి నాటకాల్లో కనిపిస్తుంది. కాని అంతటితో ఆగని చలం ఇంకా ఇంకా ఊహాలోకాల్లోకి పయనించాడు. ఆ అన్వేషణ మ్యూజింగ్స్‌లోను, వ్యాఖ్యాన నాటకాల్లోను కనిపిస్తుంది.

శిల్పం దృష్ట్యా చూస్తే చలం నాటకకర్త కాదు. అయినా ఆయన నాటకాల్లోనే చలం బలం, బలహీనతా – రెండూ కనిపిస్తాయి. అందుకే నాటకాలలో – చలం సాహిత్యమూర్తిని దర్శించినంత సమగ్రంగా – మరి ఆయన చేపట్టిన ఏఒక్క సాహిత్య విభాగంలోను మనం దర్శించలేము.